సాక్షి
తిరుపతి
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



ఆరోగ్య చంద్రగిరే చెవిరెడ్డి అభిమతం!
చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి అభిమతమని కలెక్టర్ తెలిపారు. - 8లో



వెంకటగిరిలో జాతరో జాతర
వెంకటగిరిలో జాతర శోభ ఉట్టిపడుతోంది. పోలేరమ్మ తల్లి జాతరలో రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	25
చిత్తూరు	34	24
తిరుమల	31	22
గూడూరు	37	27
నగరి	36	25

న్యూస్‌రీల్

కృతజ్ఞతలు జగనన్న!



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు

తిరుపతి తుడా : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ జగనన్నకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల కుటుంబాలు సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాయన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కిషోర్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు దామోదర్ విద్యాసాగర్, పూర్ణిమ, నాగ మోహన్, నారాయణ, పవన్ కుమార్, లోకేష్, జయప్రకాష్, హరి, బాలాజీ, హనుమాన్ నాయక్, దొరబాబు బాబు నాయక్, యుగంధర్, జనార్ధన్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



రాహు-కేతు పూజల కోసం పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని రకాల రాహు-కేతు పూజలు 7,405 నిర్వహించారు. అదేవిధంగా ఐదు రకాల ప్రసాదాలు 34,600 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఇక దున్నేద్దాం

రబీ ఆరంభం కావడంతో పంట సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణను అనుసరిస్తున్నారు. ఎరువుల వినియోగంపై అధికారుల సూచనలు, సలహాలతో అవగాహన పెంపొందిస్తున్నారు. క్రమపద్ధతిలో కలుపు మందులు వాడాలని సూచిస్తున్నారు. అధిక దిగుబడిచ్చే వంగడాల సాగుపై దృష్టి సారిస్తున్నారు. స్వల్పకాలిక పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- రబీకి అన్నదాతలు సన్నద్ధం
- అవగాహనతో ఎరువుల వినియోగం
- క్రమపద్ధతిలో కలుపు మందుల వాడకం
- అధిక దిగుబడి సాధనకు అధికారుల సూచనలు



తిరుపతి అర్బన్: ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ 30వ తేదీతో ముగిసింది. రబీ సీజన్ అక్టోబర్ 1 నుంచి ప్రారంభమైంది. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సీజన్లో రైతులు ప్రధానంగా వరి పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. కొందరు నార్లు పోసుకుని నాట్లు వేయడానికి సన్నద్ధమవుతుండగా.. మరికొందరు యంత్రాలతోను, ఇంకొందరు డ్రమ్ సీడర్‌తో వరి సాగుచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నారుపోయడం ఎలా?

తక్కువ కాలపరిమితి వంగడాలు నారు 25 రోజులకే నాట్లు వేయాలి. మధ్యకాల పరిమితి కలిగిన పంట 30 రోజుల్లోను, దీర్ఘకాలిక పంట 40 రోజుల్లో నాట్లు వేయాలి. నార్లు పీకడానికి 5-7 రోజుల ముందు నారుమడికి నీరు పెట్టి 5 సెంట్ల నారుకు 2 కిలోల కార్బోఫ్యూరాన్, 3 కిలోల గుళికలను వేసి నీరు నారు మడిలోనే ఇంకేలా చేయాలి. దీంతో నాటిన తర్వాత 40 రోజుల వరకు ఎలాంటి తెగుళ్లు సోకడానికి అవకాశం ఉండదు. అంతేకాదు పిలకలు అధికంగా వస్తాయి. రెండు రోజుల ముందు జిప్సం వేయడం ద్వారా నారు తెగిపోకుండా వస్తుంది.

తక్కువ కాలపరిమితి వంగడాల ఎంపిక

దీర్ఘకాలంగా వరి పంట సాగుచేస్తే సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. దాంతో తక్కువ కాలానికే పంట చేతికి వచ్చే వంగడాలను ఎంపిక చేసుకుటున్నారు. ప్రధానంగా బీపీటీలు-5204, ఎంటీయూ 1001, ఎన్ఎల్ఆర్-34449, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638 రకాలు 110 నుంచి 120 రోజుల్లోనే పంట చేతికి అందుతుంది. అంతేకాదు ఈ రకం వరి పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. సాధారణ పంటల కన్నా ఈ పంటలు సాగుచేయడం ద్వారా బస్తాకు రూ.200 నుంచి రూ.400 అదనంగా పొందవచ్చు.

నాట్లుకు ముందు ఎరువుల వాడకం

వరి నాట్లు వేయడానికి ముందు రైతులు పొలానికి పశువుల ఎరువు, పచ్చిరొట్టని సాగుచేయడంతోపాటు నాట్లు వేయడానికి రెండు వారాలు ముందే దుక్కి చేయాలి. దీంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించవచ్చు. డీఏపీని ఎకరానికి 10 కిలోల డీఏపీతోపాటు 20 కిలోల పొటాష్‌ను దుక్కిలో వేసుకోవాలి. రబీ సీజన్‌లో జింక్ లోపం ఎక్కువగా వస్తుంది. దీంతో ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ వేయాలి. జింక్‌ను భాస్వరం కలిగిన ఎరువుతో కలిపి వేయరాదు. ముందుగా జింక్ సల్ఫేట్‌ను వేసిన 2 రోజుల తర్వాతే కాంప్లెక్స్ ఎరువులను వాడాలని అధికారులు సూచిస్తున్నారు.

నాట్లు వేయడం ఎలా?

పొలంలో నాట్లు 3 సెంటీమీటర్ల లోతులో పైపైనే వేయాలి. నాట్లు లోతుగా వేస్తే మొక్కల నుంచి సక్రమంగా పిలకలు రావు. నాట్లు వేసే సమయంలో నీరు పలుచగా మాత్రమే ఉండాలి. లేతనారు అయితే రెండు మూడు వరి మొక్కలు మాత్రమే నాటాలి. ముదురునారు అయితే వరి మొక్కలు నాలుగు నుంచి ఆరు మొక్కలు పెట్టాలి. నాట్లు వేసే సమయంలో ప్రతి రెండు మీటర్లకు ఒకచోట ఒక అడుగు వెడల్పు దారి లేక పాయలు విడిచిపెట్టి నాటాలి. పాయలు తూర్పు-పడమర ఉండేలా చూసుకోవాలి. గాలి వెలుతు బాగా ఉంటేనే ఆహారోత్పత్తి బాగా జరుగుతుంది. పిలకలు బాగా వృద్ధి చెందుతాయి. చీడ పీడల ఉధృతి తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీ సులభంగా ఉంటుంది. నాట్లు పూర్తయిన తర్వాత ఐదు రోజుల వరకు ఐదు సెంటీమీటర్ల నీరు పెట్టాలి. తర్వాత పొట్ట దశ వరకు రెండు సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. పొట్ట దశ నుంచి గింజ దశ వరకు ఐదు సెంటీమీటర్ల నీరు ఉండాలని అధికారులు సూచిస్తూ.. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కలుపు మందు వాడకం

పొలానికి వేస్తున్న ఎరువులు వందశాతం వరి పంటకే అందేలా చేయడానికి నాట్లు వేసిన తర్వాత తొలి దశలోనే కలుపు మందును చల్లాలి. నాట్లు వేసిన 4-6 రోజుల్లో టాప్‌స్టార్(ఆక్సాడయార్గిల్) 40 గ్రాములు మందును ఒక లీటర్ నీటితో కలిపి లేదా బుటాక్లోర్ ఒక లీటర్ మందును 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో నీరు ఉంచుకుని చల్లాలి. చల్లిన తర్వాత పొలంలో నీరు తీసివేయరాదు. దీంతో అన్ని రకాల కలుపు మొక్కలు మొలకెత్తే అవకాశం ఉండదు.



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

క్రమ పద్ధతి సేద్యంతో అధిక దిగుబడి



> మంచి దిగుబడి రావాలంటే ఓ క్రమపద్ధతిలో వ్యవసాయం చేయాలి. దుక్కి దున్నేరోజు నుంచి ఒబ్బిళ్ల వరకు సరైన టైంలోనే సేద్యం చేయాలి. అలా చేస్తేనే ఆశించిన మేరకు దిగుబడి వస్తుంది. రైతులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు విధిగా పాటించాలి. అలా చేస్తే మంచి దిగుబడితోపాటు పంట నాణ్యత ఉంటుంది. దాంతో అధిక ధరలకు అమ్ముకోవడానికి వీలుంటుంది. ఈ క్రమంలో రైతులు ఓ పద్ధతి ప్రకారం వ్యవసాయం చేయాలని కోరుతున్నాం. అనుమానాలు ఉంటే నివృత్తి చేయడాని సిద్ధంగా ఉన్నాం.
>
> **- మెరుగు భాస్కరయ్య, జిల్లా వనరుల కేంద్రం, ఏడీఏ**

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



భక్తులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల: అలిపిరి నుంచి నడక మార్గంలో తిరుమలకు వచ్చే భక్తుల భద్రతా ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం రాత్రి గాలిగోపురం వద్ద పరిశీలించారు. భక్తులను నరసింహస్వామి ఆలయం వరకు తీసుకుని వెళుతున్న సిబ్బంది విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్, గూర్ఖా, సెక్యూరిటీ సిబ్బందితో చైర్మన్ మాట్లాడారు. భక్తులను నిరంతరం అప్రమత్తం చేస్తూ ఉండాలని ఆదేశించారు. నడిచి వెళుతున్న భక్తులతోను, అక్కడి దుకాణ దారులతోను మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మహాత్ముడి సేవలు చిరస్మరణీయం



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: భారతదేశానికి మహాత్మాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి అంజలి ఘటించారు. అనంతరం గాంధీజీ అహింసా మార్గాన్ని విశ్లేషించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిశోర్, డీఈఓ వీ.శేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

గాంధీ అడుగు జాడల్లో పయనిద్దాం



తిరుపతి మారుతీనగర్‌లో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: ప్రతి ఒక్కరూ గాంధీ సిద్ధాంతాలను పాటించి, ఆయన అడుగు జాడల్లో నడిచినప్పుడే హింసకు తావుండదని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన తిరుపతి మారుతీ నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘన నివాళులర్పించారు. గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ అహింసామార్గంలో హింసను పారద్రోలి బ్రిటీష్ వారి నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానుభావుడు అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం జగన్‌తోనే సాకారం



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్, మంత్రి, ఎంపీలు, అధికారులు

- శిల్పారామంలో 'నివాళి గోడ' నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న స్పీకర్, మంత్రి, ఎంపీ తదితరులు



భూమిపూజలో స్పీకర్లు తమ్మినేని, సెల్వం, మంత్రి రోజా, ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, మేయర్ శిరీషా, కలెక్టర్

చంద్రగిరి(తిరుచానూరు): గ్రామస్వరాజ్యం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాకారమని వక్తలు కొనియాడారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా చక్ర విజన్ ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో మంత్రి ఆర్కే.రోజా ఆధ్వర్యంలో స్థానిక శిల్పారామంలో స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణార్థం 'నివాళి గోడ (ట్రిబ్యూట్ వాల్)' నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ చక్ర ఫౌండేషన్ వారి సహకారం మరువలేనిదన్నారు. గాంధీజీ కలలు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని తెలిపారు. మంత్రి ఆర్కే.రోజా మాట్లాడుతూ నేడు మనం స్వేచ్ఛగా ఉన్నామంటే స్వాతంత్ర్య సమర యోధుల త్యాగఫలమేనన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో, చక్ర ఫౌండేషన్ వారి సహకారంతో ట్రిబ్యూట్ వాల్ ఏర్పాటుకు భూమి పూజ చేసినట్టు తెలిపారు. ఇలాంటి వాల్‌ను విజయవాడ, విశాఖపట్నంలో కూడా నిర్మిస్తామన్నారు. మొదట పాండిచ్చేరిలో నివాళి గోడను చక్ర ఫౌండేషన్ వారు ఏర్పాటు చేశారని, ప్రధాని నరేంద్రమోదీ సైతం ప్రశంసించంతో పాటు దేశవ్యాప్తంగా మరో 75 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని వారికి సూచించారని గుర్తుచేశారు. పుదుచ్చేరి స్పీకర్ ఆర్.సెల్వం, తిరుపతి, చిత్తూరు ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, మేయర్ శిరీష, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం సీఈఓ సుందర్‌రెడ్డి, చక్ర ఫౌండేషన్ రాజశేఖర్, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

● ఘన నివాళి



తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి.
– తిరుపతి మంగళం

గాంధీ నాయకత్వం ఆచరణీయం



మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి, కలెక్టర్

తిరుపతి రూరల్: అహింస అనే ఆయుధంతో స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ నాయకత్వం ప్రపంచానికే ఆచరణీయమని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలంలో సోమవారం మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిల సందర్భంగా వారి చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తుడా వీసీ హరికృష్ణ, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డీపీఓ ఆదెం రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, తుడా సెక్రటరీ లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహం



కాలువలో తేలుతున్న మృతదేహం

వరదయ్యపాళెం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెలుగుగంగ కాలువలో కొట్టుకొచ్చిన ఘటన మండలంలోని నాగనందాపురం సమీపంలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. నాగనందాపురం సమీపంలోని తెలుగుగంగ కాలువలో గల కల్వర్టు వద్ద ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చి తేలాడుతోంది. మృతుడు ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడు. వివరాలు పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీస్తామని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తుల వివరాలుంటే స్టేషన్‌లో తెలపాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



మంగమ్మ(ఫైల్)

ఏర్పేడు: వృద్ధురాలి అదృశ్యంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం.. మండలంలోని కొత్తవీరాపురం అరుంధతీవాడకు చెందిన మంగమ్మ(70) ఆదివారం జ్వరంతో ఏర్పేడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వారి బంధువులు, ఏర్పేడులో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం

తిరుపతి క్రైం: స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న పులిచెర్లకు చెందిన హాస్టల్ విద్యార్థిని ఆదివారం అదృశ్యమైనట్లు ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. అప్రమత్తమైన పోలీసు అధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించి ముమ్మరంగా గాలిస్తున్నారు.

హాజరైన అధికారులు, సిబ్బంది.. కుక్కర్లు, అభినందన సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి





ఆరోగ్య చంద్రగిరే చెవిరెడ్డి అభిమతం!

- ఆరు నెలలు.. 1.22 లక్షల మందికి వైద్య పరీక్షలు
- జగనన్న ఆరోగ్య సురక్షకు మూలం చంద్రగిరి : కలెక్టర్
- ఒక మంచి లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహించారు: ఎస్పీ
- ప్రజలే నా కుటుంబం.. వారికోసం ఏదైనా చేస్తా : ఎమ్మెల్యే చెవిరెడ్డి
- విజయోత్సవ సభలో 9,700 మందికి రైస్ కుక్కర్లు పంపిణీ

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభిమతమని, అందులో భాగంగానే ఉచిత మెగావైద్య శిబిరాలను ఏర్పాటు చేశారని, రూ.3 వేల ఖరీదైన 43 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేయించారని తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి కొనియాడారు. ఆరు నెలల క్రితం చంద్రగిరిలో చేపట్టిన ఉచిత మెగా ఆరోగ్య పరీక్షల కార్యక్రమం స్ఫూర్తితోనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం రాష్ట్రంలో పురుడుపోసుకుందని చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన ఉచిత మెగా వైద్యశిబిరాలు విజయవంతం కావడంతో సోమవారం తిరుపతి రూరల్ మండల పరిధిలోని రామానాయుడు కల్యాణ మండపంలో విజయోత్సవ సభను నిర్వహించారు. మెగా ఆరోగ్య పరీక్షల కార్యక్రమంలో భాగస్వాములైన 9,700 మంది అధికారులు, సిబ్బందికి రైస్ కుక్కర్లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏ పనిచేసినా పట్టువదలకుండా విజయవంతంగా పూర్తిచేస్తారన్నారు. ఆరు నెలల క్రితం చంద్రగిరి నియోజకవర్గంలో ప్రారంభమైన ఉచిత మెగావైద్య శిబిరాలను ప్రభుత్వం నిశితంగా గమనించిందన్నారు. ఆ వైద్య శిబిరాలకు ప్రజల నుంచి వచ్చే స్పందన, ఆరోగ్యం పట్ల జనం చూపిన శ్రద్ధ వంటి విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేసిందన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ అధికారుల వద్ద ప్రస్తావించారని గుర్తుచేశారు. అంతకుముందు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచే ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉండడం నిజంగా ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. తుడా వీసీ హరికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేలా ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తుడా కార్యదర్శి లక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, ప్రివియా హెల్త్ సంస్థ నిర్వాహకులు ఫణీతో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9,700 మందికి రైస్ కుక్కర్లు పంపిణీ

ఉచిత వైద్య శిబిరాలు విజయవంతం కావడానికి కష్టపడిన ప్రభుత్వ వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఆశావర్కర్లు, 104 సిబ్బందితో పాటు ప్రివియా హెల్త్ సంస్థ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు అందరినీ విజయోత్సవ సభకు ఆహ్వానించి పది రకాల వంటకాలతో శాఖాహార భోజనం ఏర్పాటు చేశారు. సభకు హాజరైన 9,700 మంది ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ 7.5 లీటర్ల మల్టీ పర్పస్ రైస్ కుక్కర్లను బహుమతిగా అందించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వారికి సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరు మండలాలు.. ఆరు నెలలు.. 1.22 లక్షల మందికి పరీక్షలు

ఆరు మండలాలు.. 109 గ్రామ సచివాలయాలు.. ఆరు నెలలు.. 500పైగా ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 1.22 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేయించారు. ప్రతి గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి రక్త పరీక్షలతో పాటు గుండె పరీక్షలు చేయించారు. గుండె పరీక్షల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు కలిగిన వారిని గుర్తించి పెద్ద ఆస్పత్రిలకు పంపి సకాలంలో వైద్య సేవలు అందించారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 3 వేల మందిని ప్రాణాపాయం నుంచి ఎమ్మెల్యే చెవిరెడ్డి రక్షించారు.

అసాధ్యాలను సుసాధ్యం చేశారు

చంద్రగిరిలో ఏ కార్యక్రమం చేసినా రాష్ట్రమంతా చెప్పుకుంటారని, అసాధ్యాలను సుసాధ్యం చేయగల సత్తా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే ఉంటుందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడించారు. ఉచిత మెగా వైద్య శిబిరాల వల్ల ఎంతో మంది నిరుపేదలకు ఆరోగ్యాన్ని అందించామన్న ఆత్మ సంతృప్తి కలుగుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 60 వేల మందికిపైగా ఈసీజీ తీస్తే అందులో సుమారు 3వేల మందికి హఠాత్తుగా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉన్నట్టు గుర్తించగలిగామన్నారు. తొండవాడ పంచాయతీ కార్యదర్శి నజిరీన్ బేగం భర్తకు ఈసీజీ తీసిన వెంటనే అత్యంత ప్రమాదకరంగా ఉందని గుర్తించి స్విమ్స్ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. అక్కడి వైద్యులు ఆగమేఘాలపై యాంజియో తీసి స్టంటు వేసి ప్రాణం నిలబెట్టారంటూ కన్నీరు పెట్టుకున్నారు.

ప్రజలే నా కుటుంబం.. వారి కోసం ఏదైనా చేస్తా..

'చంద్రగిరి నియోజకవర్గ ప్రజలే నా కుటుంబంగా భావించాను.. వారి క్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాను.. కరోనా వంటి కష్టం వచ్చినా.. వరదలు వంటి విపత్తు వచ్చినా.. పండుగలు వచ్చినా.. పర్వదినాలైనా అందరికీ మంచి చేయాలన్న తపనతో వారి వెంట నిలబడుతున్నాను. నా కుటుంబం వేరు కాదు.. నా ప్రజలు వేరు కాదని బలంగా నమ్మిన వ్యక్తిని కనుకనే నా బిడ్డ మోహిత్‌రెడ్డికి కూడా ఈ వేదికపై నుంచి సూచిస్తున్నా.. రాజకీయాల్లోకి వచ్చాక కుటుంబం వేరు, ప్రజలు వేరు అనుకుంటే రాజకీయనాయకుడే అవుతావు.. కుటుంబం, ప్రజలు ఇద్దరూ ఒక్కటే అనుకుంటే నాయకుడు అవుతావు' అంటూ ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రజలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అత్యధిక సమయం విజయవాడలో గడపాల్సి వస్తున్నందున తన బిడ్డ మోహిత్‌రెడ్డిని తనలాగా ఆదరించి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వెంకటగిరిలో జాతరో జాతర!

- పోలేరమ్మ తల్లి జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- రాష్ట్ర పండుగ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నేదురుమల్లి, సర్వజ్ఞ కుమారయాచేంద్ర

సైదాపురం, వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో జాతర శోభ ఉట్టిపడుతోంది. గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర రెండో రోజు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీప కాంతులు ఆకట్టుకున్నాయి. రోజుకొక వినూత్న కార్యక్రమాలు స్థానికులను కట్టిపడేస్తున్నాయి. యువత కేరింతలు, ఈలలు మార్మోగుతున్నాయి. ప్రధానంగా కర్ణాటక డప్పు వాయిద్యాలు, కొమ్ము నృత్యాలు జాతర శోభను ప్రతిబింబిస్తున్నాయి. అలాగే కావలి కోలాట నృత్యం, తెలంగాణా నేపథ్యంలో సాగే భక్తిపాటలు సంగీత ప్రియుల మనసును హోలలాడిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమారయాచేంద్ర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, నియోజకవర్గ నేతలు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఢిల్లీబాబు, ప్రసాద్‌రెడ్డి, ఎల్.కోటేశ్వరరావు, సతీష్, కృష్ణారెడ్డి సహకారం అందిస్తున్నారు.



ఆకట్టుకున్న జానపద నృత్యం



వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

ఇనుప బాక్సులు చోరీ

చంద్రగిరి: కాలువ నిర్మాణాల కోసం వినియోగించే 70 ఇనుప బాక్సులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన సింహాద్రి తాపీ మేస్త్రీ. మండల పరిధిలోని బుచ్చినాయుడుపల్లి గ్రామంలో కాలువ నిర్మాణాల కోసం రెండు రోజుల క్రితం సుమారు రూ.2.1 లక్షల విలువ చేసే 70 ఇనుప బాక్సులను గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో భద్రపరిచాడు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం పనులు చేసేందుకు కమ్యూనిటీ భవనం వద్దకు వెళ్లగా ఇనుప బాక్సులు కనిపించలేదు. దీంతో సింహాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కొత్త అపార్ట్‌మెంట్ బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డు, అంకుర ఆస్పత్రి సమీపంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఆర్ కాస్మోస్ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆదివా రం సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చలపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నూతనమైన సదుపాయాలతో 2 బీహెచ్కే, 3బీహెచ్‌కే, 1230 స్క్వేర్ ఫీట్స్ నుంచి 2085 చదరపు అడుగుల వరకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. విశాలవంతమైన అమినిటీస్ బ్లాక్ 15,000 స్క్వేర్ ఫీట్స్, క్రికెట్ పిచ్, బ్యాడ్మింటన్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, జాకింగ్ ట్రాక్ వంటి ఎన్నో సదుపాయాలు తమ కొత్త అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ డైరెక్టర్స్ హర్షితరెడ్డి, లోకేష్‌రెడ్డి, వినీషారెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ సోమేశ్వర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతి



గలంతైన మనోజ్ మృతదేహం

రాపూరు: సిద్ధిలేశ్వర కోనలోని ఆదివారం గల్లంతైన విద్యార్థి మృతి చెందినట్టు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, ఇస్కపల్లి గ్రామానికి చెందిన మనోజ్(21) పాండిచ్చేరిలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని, వరుస సెలవులు నేపథ్యంలో తన మిత్రులతో కలిసి ఆదివారం సిద్ధిలేశ్వర కోనకు చేరుకున్నాడన్నారు. కోనలోని నీటిగుండంలో ఈత కొడుతుండగా మనోజ్ మునిగిపోయాడని తెలిపారు. అతని మిత్రులు రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సోమవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం బయటపడిందన్నారు. మనోజ్ తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టా భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడుగా వల్లూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, కోశాధికారిగా కాసుల సునీల్‌దత్‌తో పాటు ఐదుగురు కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతీరావ్ పూలే ఆశయ సాధనకు, బీసీ ఉద్యోగుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.



ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసులు



ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్